


# చివరకు మిగిలేది

'అమరేంద్ర'

"నిజంగా నీకు కళ్ళు కనిపించవా?" అని అడిగాడు కృష్ణమూర్తి.

"అబద్ధం ఆడతావా, బాబూ? కళ్ళులేని కబోదిని. చూడటానికి చక్రాల్లాగా ఉంటాయి అంటుంది మా అమ్మ. కాని, చూపుమాత్రం లేదు" అని తల వంచుకుని బదులు చెప్పింది ఆ పిల్ల. ముచ్చటైన ముఖం, వంచిన విల్లు వంటి కనుబొమలు, సిద్ధహస్తుడైన శిల్పి తీర్చిదిద్దినట్లు ఉన్న ముక్కు, కష్టాలను లక్ష్యం చెయ్యకుండా చిరునవ్వు చిందుతున్న పెదవులు, వింతగా మెరిసే కళ్ళు— చూడగానే ఆ పిల్ల గుడ్డిదని ఎవరూ అనుకోలేరు. చెప్పినా నమ్మకం కలగదు. కాని, ఇంకోసారి ఆ ముఖంకేసి చూస్తే రెప్పలు ఆరుస్తూ, ఈ లోకంలో తనకు అందని ఏ మహా సౌభాగ్యం కోసమో తడుముకుంటూ కళ్ళు వెతుక్కుంటున్నట్లు తెలిసిపోతుంది. ఎటువంటి కటిక గుండె వాళ్ళకైనా 'అయ్యో, పాపం!' అనిపిస్తుంది.

హోటలు ముందు కూర్చుని ఆ పిల్ల పాడుతూ ఉంటుంది. ఆ పాట మనుష్యులను మత్తు చల్లినట్లు నిలబెట్టివేస్తుంది. హృదయాంతరాళాలలోంచి వచ్చే ఆ పాటలో వేదన మధురంగా కరిగిపోయి ఎదుటివాళ్ళని కరిగించివేస్తుంది. ముందు పరిచి ఉన్న గుడ్డ ధర్మాత్ముల చిన్ని కానుకలతో నిండిపోతుంది. అక్కడ ప్రొద్దున్నే దిగవిడిచి వెళ్ళి మూడు కాళ్ళ ముసలి తల్లి చీకటి పడ్డాక వచ్చి కూతురు చెయ్యి పుచ్చుకుని ఊరి బయట పాడుపడ్డ సత్రానికి నడిపించి తీసుకుపోతుంది.

ఆ సత్రానికి చేరువలోనే ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు కృష్ణమూర్తి. పగలంతా హోటల్లో సర్వరుగా పనిచేసి, ఊళ్ళోవచ్చిన కొత్త సినిమాకి లేక పరామర్శ చేసి అర్ధరాత్రి అయ్యాక ఇంటికి చేరుకుంటాడు. ఉడిపి దగ్గర ఏదో చిన్న పల్లెటూరి నించి పొట్ట చేత పట్టుకొని ఇంత దూరం వచ్చాడు. చిన్నప్పుడే తల్లి, తండ్రీ పోయారు. ఈ మధ్య ముసలి నాయనమ్మ కూడా అతణ్ణి లోకంలో పూర్తిగా ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయింది.

శూన్యంగా ఉన్న అతని హృదయాన్ని ఆ గుడ్డి పిల్ల పాట మాధుర్యంతో నింపివేసింది. 'నా' అనేవాళ్ళు ఎవరూ లేని లోకంలో ఆ కంఠస్వరం అతణ్ణి చల్లగా పలకరిస్తున్నట్లు అనిపించేది. అందుకే తనకు జీతం అందగానే ఒక రూపాయి ఆ పిల్లముందు పడేశాడు.




చేతితో నిమురుతూ, "ఇది కానీ కాదు, బాబూ, పొరపాటు పడ్డారేమో?" అంది ఆ పిల్ల.

అందుకే "నిజంగా నీకు కళ్ళు కనిపించవా?" అని అడిగాడు.

"నాకు వద్దు. తీసుకోండి. ఒక కానీ చాలు, ఈ కబోదికి. ఈ రూపాయి తీసుకుంటే అమ్మ చంపే స్తుంది" అని బతిమాలుకుంది.

"నీకేం భయం అక్కర్లేదు. తీసుకో. మీ అమ్మతో నేను చెబుతాలే" అని బలవంతం చేశాడు కృష్ణమూర్తి.

ఆ నాటి నుంచి వాళ్ళిద్దరూ ఆ హోటలు దగ్గిరే కలుస్తూ ఉన్నారు. కంఠస్వరాన్ని గుర్తుపట్టి కృష్ణ మూర్తి రాగానే భుజాల మీదికి ఓణీ కప్పుకుంటూ వినయంగా చేతులు జోడిస్తుంది. హోటలు యజ మాని కన్ను కప్పి మధ్య మధ్య జిలేబీ, కోవా, మైసూర్ పాక్ అందిస్తూ ఉంటాడు కృష్ణమూర్తి. తీరుబాటు చిక్కినప్పుడల్లా ఆ పిల్ల దగ్గరికి వచ్చి కబుర్లు చెప్పిపోతూ ఉంటాడు.

"ఇదుగో! ఇదేమిటో చెప్పుకో చూద్దాం" అని ఆ పిల్ల మీదికి ఒక గులాబి పువ్వు విసిరాడు. నవ్వుతూ అందుకుని తలలో ముడుచుకుంది.

"ఈ పువ్వు నీలాటిదే. దానికి కళ్ళు లేవు. తను ఎంత అందంగా ఉందో దానికి తెలియదు" అన్నాడు. లేత సిగ్గు దొంతరలతో ఆ పిల్ల ముఖం విచ్చిన గులాబి లాగా అయిపోయింది.

"ఇంతకూ నీ పేరేమిటో చెప్పావు కాదు ఇన్నాళ్ళ నుంచి!"

"మీరు అడగకుండా నే నెందుకు చెబుతానేం?"

"ఇప్పుడు అడుగుతున్నాగా? చెప్పు."

"మణి" అని సిగ్గుపడుతూ చెప్పింది.

"మరి నా పేరేమిటని అడగవేం?"

"మిమ్మల్ని అడగకుండానే నాకు తెలిసిపోయిందిగా!"

"సరే, మళ్ళీ వస్తాను. మా ప్రొప్రయిటరు వస్తున్నాడు. ఆయనతో మాట్లాడి నీకు మధ్యాహ్నం హోటల్లోనే భోజనం పెట్టే ఏర్పాటు చేస్తాను."

"ఊరికే వద్దులెండి. కప్పులూ, సాసర్లూ జాగర్తగా కడిగి పెడతాను. ఆయనకి చెప్పండి" అని మణి తన అభిమానం వెల్లడించుకుంది.

ఈ ఏర్పాటుకు యజమాని ఎలాగో ఒప్పు కున్నాడు. కొండంత సంతోషంతో కృష్ణమూర్తి ఈ శుభవార్త మణికి వినిపిద్దామని బయటికి వెళ్ళాడు.

మసక చీకటి పడబోతూంది. వీధులన్నీ కిటకిట లాడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు చిన్న టాకా లాలు వీధుల్లో పెట్టుకుని పళ్ళూ, పూలూ అమ్ము కునే వాళ్ళనూ, పాత చెప్పులు బాగు చేసుకునేవాళ్ళనూ, బిచ్చగాళ్ళనూ బలవంతాన తరిమివేస్తున్నారు. వచ్చిన డబ్బులు మూట కట్టుకుని గబగబా లేవబోతున్న మణి వెనక నుంచి పోలీసు లాఠీతో నెట్టగానే తూలి పోయి ముందుకు పడింది. పైసలూ, కానీలూ చెల్లాచెదరై మనుషుల కాళ్ళ కింద పడిపోయాయి. నిస్సహాయ స్థితిలో నిలబడిపోయిన మణి కనుకొల కుల్లో బాష్పాలు తళుక్కు మన్నాయి. చూస్తున్న కృష్ణమూర్తి గుండె కరిగిపోయింది.

"మణీ! నీకేం భయం లేదు. నేను వస్తున్నాను, ఉండు" అంటూ ముందుకు ఒక్క గంతువేసి కింద పడి దొర్లిపోయిన వాటిలన్నీ పోగుచేసి మూటకట్టి ఇచ్చాడు.

"ఇంటికి వెళతావా?"

"చీకటి పడుతోంది" అని బెదురుతూ అంది మణి.

"ఇంకా మీ ముసలిది రాలేదేం ఇవాళ?"

"ఒంట్లో బాగాలేదు."

"అయితే, పొద్దున్న ఎలా వచ్చావు?"

"మా సత్రంలో ఉన్న కుంటి వాడి వెంట వచ్చాను."

"మంచి పని చేశావు. నాకు చెప్పలేదేం? పద, నేను దారి చూపిస్తాను. సత్రం దగ్గర దిగబెట్టి వస్తాను."

"మీ పని అయ్యేదాకా ఈ మెట్ల మీద కూర్చుంటాలెండి. తొందర లేదు."

"ఇంకా నీవు రాలేదని మీ అమ్మ కంగారు పడుతుంది. ముందు నిన్ను దిగబెట్టి వస్తాను. పద, మరి" అంటూ చెయ్యి ఊత ఇచ్చి జనసమ్మర్దంలోంచి తప్పించుకుంటూ సత్రం వైపు నడక సాగించాడు. తల్లికి ఎలా ఉందో అనే దిగులుతో మణి మనస్సు పరిపరి విధాలా పోతూంది. లోకంలో ముదుసలి తల్లి ఒక్కతే ఆమెకు దిక్కు. అడుగులు తడబడుతున్నా, గబగబా నడవాలని ప్రయత్నం చేస్తూంది. కృష్ణమూర్తికి తన నడవడి తనకే ఆశ్చర్యం కలిగిస్తూంది. ఈ గుడ్డి పిల్లను నడి బజారు వెంట తను నడిపించుకు పోవటమేమిటి? తనెవరు? ఆ పిల్ల ఎవరు? తనకీ ఆ పిల్ల మీద ఎందుకింత జాలి? అనుకొంటూ నడుస్తున్నాడు. దీపావళి పండుగకు కాల్చి విసిరి వేస్తున్న టపాకాయల బారి నుంచి మణిని తప్పించి భద్రంగా నడిపించుకుపోయాడు. దారిలో ఒకరిద్దరు పోకిల్లా స్నేహితులు అతణ్ణి చూసి వెటకారంగా నవ్వుకున్నారు. అయినా, ఈ ఏకాకి లోకంలో మణి కంటె తనకు ఆత్మీయులెవరూ లేరనిపించింది. మణి కూడా నిర్భయంగా, నిస్సంకోచంగా అతని చెయ్యి గట్టిగా పట్టుకుని నడిచి వస్తూంది. కొండంత అండ దొరికి నంత బలం వచ్చి మణి కాళ్ళకే కళ్ళు వచ్చినట్లు గబగబా సాగిపోతూంది.

భవిష్యత్తంతా కటిక చీకటి. దరీ తెన్నూ కనబడటం లేదు. తల్లి కూడా లేకపోతే మణికి ఇంకె దిక్కెవ్వరు? కంటిచూపు లేని మణి కంటకమయమైన జీవితంలో ఒంటరిగా ఎలా సాగిపోగలదు? అనుకోకుండా కృష్ణమూర్తి నోటి వెంట—"మణీ! ఊరికే దిగులు పడకు. ఎంత ఏడ్చినా లాభం ఏముంది? ధైర్యం తెచ్చుకో. నీ కేలోపము రానివ్వను. నే నున్నాను నీకు తోడు. దిక్కులేని మనబోటి దీనులకు ఆ దయామయుడే పెద్ద దిక్కు" అనే మాటలు వెలువడినాయి. శోకంతో రగిలిపోతున్న మణి గుండె మీద కృష్ణమూర్తి మాటలు తొలకరి జల్లు చిలకరించినాయి. చుట్టూ చేరిన వాళ్ళంతా ఆశ్చర్యంగా అతని వైపు చూశారు.

అప్పటి నుంచి మణి కృష్ణమూర్తి గదిలోనే ఉంటున్నది. హోటలు ముందు ముష్టి ఎత్తుకోవటం మాన్పించి వేశాడు. అతనికి వచ్చిన కొద్ది జీతంతోనే ఇద్దరూ కాలం వెళ్ళదీస్తున్నారు.

అంతవరకూ కృష్ణమూర్తి జీవితం ఎటునుంచి గాలి తోలితే ఆ వైపు తేలిపోయే మేఘం లాగా కదిలి పోయేది. జీవితానికి గురి లేదు. బరువు అంతకన్నా లేదు.

కాని, మణిని పోషించే భారం పైన వేసుకున్నప్పటి నుంచీ అతనిలో మార్పు వచ్చింది. ఎలాగైనా సరే, మణికి చూపు వచ్చేటట్లు చెయ్యాలనే చింత అతణ్ని పగలూ, రాత్రీ పట్టుకొని వదలటం లేదు. తన సర్వస్వమూ సమర్పించి అయినా సరే మణి కళ్ళకు చూపు తెప్పించాలి. అదే అతని ఆలోచన అన్నిటికీ గమ్యం.

అందుకే ఆ నగరంలో ఉన్న నేత్ర వైద్యు లందరినీ సంప్రదించే వాడు. విదేశాలలో చనిపోయిన మనుష్యుల కనుపాపలు అతికి పుట్టు గుడ్డివాళ్ళకు కూడా చూపు తెప్పిస్తున్న కథలు పత్రికల్లో చదివి ఎంతో ఆశతో పొంగిపోయే వాడు. ఏనాటికైనా మణి కళ్ళలో మణి దీపికలు వెలిగి తీరుతాయనే ఆశ అతని గుండెలో వేళ్ళు నాటుకుంటూ, అతని జీవితంలో ఒక తీయదనాన్ని కల్పిస్తున్నది.

ఆ మధ్య విదేశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి నేత్ర వైద్యంలో ఆధునిక విధానాలు అవలంబిస్తున్న డాక్టరు ఒకాయన ఆ ఊరికి వచ్చినట్లు విన్నాడు. అవలీలగా ఆపరేషను చేసి ఎందరి కళ్ళకో వెలుగు చూపించి పుణ్యం కట్టుకుంటున్నాడనే కథలు వాడవాడలా పాకిపోయాయి. ఒక సెలవు రోజు కృష్ణమూర్తి ఆయన దగ్గరికి వెళ్ళాడు. ఆ డాక్టరు పేరు దయానిధి. పెద్ద బంగళా ముందు చక్కటి పూలతోట. మధ్యలో ఒక పాలరాతి అప్సరస విగ్రహం. ఆమె చేతుల్లో ఉన్న పాత్రలోంచి నాలుగు వైపులకూ చల్లగా జల్లు లాగా నీళ్ళు చిందుతున్నాయి. రంగు రంగుల సీతాకోక చిలకలు పువ్వులతో సరసాలు ఆడుతున్నాయి. ఏదో కొత్త లోకంలోకి వచ్చినట్లు తోచింది. ఆ భవనపు ఆవరణలో అడుగు పెట్టగానే. కాని, డాక్టరుతో మూడు ముక్కలు మాట్లాడేసరికి కృష్ణమూర్తికి తెలిసి వచ్చింది — నేతి బీరకాయలో నెయ్యి దయానిధిలో దయ! చూపు తప్పక వస్తుంది.



కాని, ఫీజు ఆరు వందలు. పైసా కూడా తగ్గించ టానికి వీలు లేదు.

"ఇంతకీ ఆపరేషన్ ఎవరికి?" అన్నాడు డాక్టరు.

"మణికి. అంటే ..." అని తడబడ్డాడు కృష్ణమూర్తి.

"నీ భార్యా?"

"కాదు. కాదు."

"నీ చెల్లెలా?"

"కాదు. బంధువు."

"బం...ధు...వు!" అని వెటకారంగా అన్నాడు దయానిధి.

"తమని మళ్ళీ కలుస్తానండి" అంటూ చివాలున లేచి ఇంటిదారి పట్టాడు. నీలాకాశంలో తేలిపోయే గాలిపటంలా ఉంది మనస్సు. నేలమీద నడుస్తున్నా కాళ్ళు గాలిలో ఎగిరిపోతున్నాయి. ఇంటికి వస్తూనే "మణీ! మణీ!" అని కేక పెట్టాడు. నాలక వంచం లోంచి లేచి తడుముకుంటూ కూజాలో మంచినీళ్ళు గ్లాసులో పోసి తీసుకువచ్చింది.

"మనకు మంచి రోజులు వస్తున్నాయి" అంటూ కృష్ణమూర్తి జరిగినదంతా చెప్పాడు.



"అమ్మయ్యో! ఆరు వందలే!" అని మణి కూలబడి పోయి గోడకు ఆనుకుంది.

"ఇవాళిటి నుంచీ సినిమాలు చూడను. సిగిరెట్లు మానేస్తాను. ప్రతి పైసా నిలవ చేస్తాను."

"వీల్లేదు. నాకోసం మీరు ఇంత కష్టపడటం నాకు ఇష్టం లేదు. నేను భరించలేను. మీ పైన ఇంత భారం మోపి నేను పనీపాటా లేకుండా ఇంట్లో కూర్చోలేను. నన్ను వెళ్ళిపోనివ్వండి. నాకోసం మీరు ఎన్నో బాధలు పడుతున్నారు. నేను సహించలేను" అని మణి కృష్ణమూర్తి పాదాలని చేతులతో నిమురుతూ ఆవేశంగా అన్నది. ఆమె విశాల నయనాంచలాల్లో బాష్ప బిందువులు తొణకటం అతను గమనించాడు.

"ఈ సారి వెళ్ళిపోతానంటే నేను ఫూరుకోను, మణీ! నా మీద ఒట్టు! ఈ మాత్రం సాయం నేను చెయ్యకూడదా?" అని మణి తలమీద చెయ్యి వేసి చెదిరిన ముంగురులు సవరించాడు.

"నా కోసం ఇంత బరువు మీరు మోస్తూంటే నాకు బాధగా ఉండదా? నేను మీ ఋణం ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేని దీనురాలిని."

"ఛీ! ఇలాంటి మాట లని నన్ను బాధపెట్టకు. నువ్వు వచ్చాక నా జీవితం — " అని మాట పూర్తి చెయ్యలేక పోయాడు. రెండు పిచ్చుకలు కిచకిచ లాడుతూ, కిలకిలమంటూ ఇద్దరి మధ్య నుంచీ తుర్రున ఎగిరిపోయాయి. పక్క ఇంటి నుంచి ఆకాశవాణి ఆలపించే వాద్య సంగీతం మధురంగా తేలి వచ్చి మూగ గుండెలను అంచులదాకా నింపి వేసింది.

"మణీ! నేను ఇంట్లో లేనప్పుడు మోసం చేసి వెళ్ళిపోతావా? వెళ్ళనని చేతిలో చెయ్యి వెయ్యి."

"అమ్మ దొంగా! నన్ను బానిసగా కట్టి పడెయ్యాలని ఎత్తు వేస్తున్నారా?"

"అయితే, ఇక నుంచీ బయటకు వెళ్ళేప్పుడు గదికి తాళం పెడతాను" అన్నాడు నవ్వుతూ.

"అబ్బ! ఎంత అపనమ్మకమో నా మీద!" అంటూ కిలకిల నవ్వింది. కాబూలీ దానిమ్మలాంటి పెదవులు, ముత్యాల వంటి పళ్ళవరస, ఉంగరాల ముంగురులు మణి ముఖాన వింత అందాలు చిందాయి. కొనవేళ్ళతో అతని ముఖాన్ని నిమిరితే బాగుండు ననిపిస్తూంది. ఏకాకి అయిన తనకు ఈ లోకంలో నిలవ నీడ ఇచ్చిన ఆ కృష్ణమూర్తి ముఖం ఎలా ఉంటుందో చూడాలనే తహతహ మణి మనస్సులో అశాంతి రేకెత్తిస్తూంది. అతని ముఖం చూసేటందుకైనా తనకు చూపు వస్తే బాగుండు ననుకుంటూంది.

"అబద్ధం కాదు,మణీ! నాకొక మంచి స్నేహితుడు ఉన్నాడు. చాలా చిత్రమైన మనిషి. గొప్ప ధనవంతుడు. నేను అడిగితే తప్పక సాయం చేస్తాడు"

"చాల్లెండి! ఎవరైనా వింటే నవ్వి పోతారు. ఆ తాగుబోతు ధనంజయం మాటేనా? నమ్ముకుంటే కుక్క తోక పుచ్చుకుని గోదావరి ఈదినట్లే? అయినా, మనలాంటి వాళ్ళకు అంత గొప్పవాళ్ళతో సావాసం దేనికి? ఎప్పటికైనా ముప్పు వస్తుందని ఎన్నిసార్లు చెప్పినా మానరు."

"కాదు, మణీ! ఆయనే నన్ను వదలటం లేదు. నాకోసం ప్రాణం అయినా ఇస్తానంటాడు. అందరూ దుర్మార్గు డంటారు. కాని, అంత మంచివాణ్ణి నే నెక్కడా చూడలేదు."

"నాకు తోచింది నేను చెప్పాను. ఆ పైన మీ ఇష్టం" అంది మణి.

కృష్ణమూర్తి పనిచేసే హోటల్‌కు కాఫీ, టిఫిన్లు పుచ్చుకోవటం కోసం రోజూ వస్తాడు ధనంజయం. వెతుక్కుంటూ కృష్ణమూర్తి పనిచేసే బల్ల దగ్గరికే వెళ్ళి కూర్చుంటాడు. నవ్వుతూ, నవ్విస్తూ చాలా సేపు ఏవేవో కబుర్లు చెబుతాడు. దుబ్బులాంటి వంకెల క్రాపూ, పచ్చని వెడల్పయిన చాతీ కనబడే పలుచని గ్లాస్గో లాల్చీ, మెడలో బంగారపు గొలుసూ, గళ్ళ లుంగీ చూసి మర్యాదస్తులు దూరంగా జరుగుతారు. "ఏరా, కృష్ణా! మొన్న సెలవు రోజు ఇంటికి రాలేదేం? బొత్తిగా తీరుబాటు లేదా, పాపం?" అన్నాడు ధనంజయం.

"ఇవాళ రాత్రి తప్పకుండా వస్తాను. మీతో అవసరమైన పని వచ్చింది" అన్నాడు కాఫీ కప్పు అందిస్తూ కృష్ణ మూర్తి.

"సరే, తప్పకుండా రా, వెళతాను" అని లేచి పెద్ద అంగలు వేసుకుంటూ పోయాడు ధనంజయం. నల్లద్దాల కళ్ళజోడులోంచి చుట్టూ పక్కల అంతా పారజూసి హోటల్ ముందున్న కుంటి బిచ్చగాణ్ణి గుర్తు పట్టి, "ఏరా, బాగున్నావా?" అని పలకరించి ఒక పావలా విసిరివేసి వెళ్ళిపోయాడు. "వెయ్యేళ్ళు చల్లగా ఉండు, తండ్రీ!" అంటూ భిక్షుకుడు పలికిన దీవెన ధనంజయానికి వినబడలేదు.

అతని అధీనంలో బియ్యపు మరలూ, పొగాకు కంపెనీలూ, బట్టల షాపులూ ఎన్నో ఉన్నాయి. డబ్బు రెండు చేతులా సంపాదిస్తాడు. బీదల రక్తం పీల్చిన జలగ అంటారు కొందరు. మదిరకోసం, మదిరాక్షుల కోసం తీరని దాహంతో వెంపరలాడే భోగ లాలసుడని అంటారు మరి కొందరు. అటువంటి వాడితో స్నేహం ఏమిటని అంటారు. కృష్ణమూర్తి తప్పించుకోవాలని పెనుగులాడినా లాభం లేక పోయింది. ధనంజయం తనే వచ్చి కృష్ణమూర్తిని ఇంటికితీసుకు వెళతాడు. గంటల తరబడి అతనితో పేక ఆడుతూ కాలక్షేపం చేస్తాడు.

ధనంజయం మూడు అంతస్తుల మేడ బావురు మంటూ ఉంటుంది. క్రింది భాగంలో నౌకర్లూ, వంటవాళ్ళూ హడావిడి చేస్తూ ఉంటారు. మూడవ అంతస్తులో మూల ఉన్న గదిలో అతను ఒంటరిగా ఉంటాడు. ఆ గదిలోకి వెళ్ళాలంటే పాత నౌకర్లకు కూడా గుండెలో దడ పుడుతుంది. అయిదేళ్ళ క్రిందట ధనంజయం భార్యా, కొడుకూ కలరా తగిలి ఒక రాత్రే చనిపోయారు. అతను పూర్తిగా ఒంటరివాడై పోయాడు. ఒకనాడు మైకంలో రోడ్డు మీద పడిపోతే హోటలు నుంచి ఇంటికి పోతున్న కృష్ణమూర్తి అతణ్ణి తన గదికి తీసుకు వెళ్ళి ఉపచారం చేశాడు. అప్పటి నుంచి ధనంజయానికి కృష్ణమూర్తి అంటే అభిమానం. పడి పోయినప్పుడు అతని జేబులో పర్సు ఉంది. దాని నిండా నోట్ల దొంతరలు ఉన్నాయి. మరునాడు ఆ పర్సును భద్రంగా ధనంజయానికి అప్పగించాడు కృష్ణమూర్తి. అందులో కానీ కూడా తీసుకోలేదు. ఈ ఘటనవల్ల కృష్ణమూర్తి అంటే ఆదర గౌరవాలు ఏర్పడ్డాయి.

డా॥ పి.వి.కె. రావ్, B.A.

సెక్స్ స్పెషలిస్ట్
(వైద్య విద్వాన్ - వైద్యాచార్య)
వివాహము వాయిదా వేయ నవసరము లేదు. దురభ్యాసములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ...
రావ్స్ క్లినిక్,
టి.బి.రోడ్, తెనాలి. ఫోన్: 700.

మీకు బేబి/బాబు కావాలా

ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా [illegible] లచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతాపత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు. ఉచిత వివరములకు
శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రెల్వే సేషన్ వద్ద, రామాలయం వీధి.
తెనాలి - 2



అన్న ప్రకారం హోటలు పని కాగానే కృష్ణమూర్తి ధనంజయం మేడకు వెళ్ళాడు. సూటిగా మూడవ అంతస్తులో ఉన్న గదిలోకి నడిచాడు. ఆ ఇంట్లో అతణ్ణి ఎవరూ అడ్డగించటానికి వీలు లేదు.

"వచ్చావా, కృష్ణా? కూర్చో చాలా రోజు లయింది. బ్రిడ్జి ఆడదాం" అంటూ పేకాటలోకి దిగాడు.

ఆట మంచి పట్టులోకి వెళుతూంది. ముక్కలు కలిపే టప్పుడు కృష్ణమూర్తి సంకోచ పడుతూ, తడ బడుతూ తన కోరిక ఏమిటో విన్నవించాడు. ధనం జయం ఏమీ మాట్లాడలేదు. బిగ్గరగా నవ్వుతూ ఖాళీ అయిన సీసాను తివాచీ మీదికి తోసివేశాడు. కృష్ణమూర్తికి భయం వేసింది. ధనంజయం మీద జాలి కలిగింది. "చేతులారా ఎలా ఆరోగ్యాన్ని ధ్వంసం చేసుకుంటా రెందుకు! ఈ అలవాటు మానరా?" అని దీనంగా అడిగాడు.

"ఈ లోకం సుఖాన్ని ఇవ్వదు. దుఃఖాన్ని మరిచి పోనివ్వదు. నాకు అడ్డం రావద్దు. ఇంకోసారి ఈ మాట అన్నావంటే నిన్ను ఈ కిటికీలోంచి విసి రేస్తాను" అని అరిచాడు. అతని కోపం చూసి కృష్ణమూర్తి వణికి పోయాడు. ఇంతలో ఇంకో సీసా బిరడా తీసి గ్లాసులో పోసి గటగటా తాగుతూ, "భయపడ్డావా, కృష్ణా? ఇలారా. ఇదిగో తాళం చెవులు. ఆ బీరువా తెరువు. నీకు కావలసినంత సైకం తీసుకో" అని తాళంచెవుల గుత్తి మీదికి విసిరి వేశాడు.

"అప్పుగా ఇస్తేనే పుచ్చుకుంటాను" అన్నాడు కృష్ణమూర్తి.

"అఘోరించావు లేవోయ్! తీసుకో ముందు" అని గదమాయించాడు ధనంజయం.

కృష్ణమూర్తి బీరువా తెరిచి అరవై పదిరూపాయల నోట్లు లెక్కపెట్టి జేబులో పెట్టుకున్నాడు. బీరువాతలుపులు వేసేసి తాళంచెవులు ధనం జయం చేతికి ఇచ్చాడు. అరచేతిలోంచి గుత్తి క్రింద పడి ఘల్లున మోగింది. ధనంజయం పిలిచినా పలికే స్థితిలో లేడు.

గబగబా ఇంటిదారి పట్టాడు కృష్ణమూర్తి. మబ్బుల్ని తప్పించుకుంటూ చందమామ పరు గెత్తుతున్నాడు నీలాల కొండమీద.

ఇంటికి వచ్చే సరికి చీకట్లో నేలమీద పడుకుని మణి గాఢనిద్ర పోతూంది.

దీపం వెలిగించి, నులక మంచం మీద నడుము వాల్చాడు. ఎప్పుడు తెల్లవారుతుందా అనే యావ. కంటికి కునుకు రాలేదు. మరునాడే మణి కళ్ళకు ఆపరేషన్. డాక్టర్ కోరిన సైకం ఇచ్చేసి మణిని అంధత్వమనే బంది ఖానాలోంచి విడుదల చేయాలి. లోకంలో అందమైన ప్రదేశాలన్నిటా తనూ, మణీ సంచారం చేయాలి. ఆనందంలో ఇద్దరూ తేలి పోవాలి. దీపకళిక లేని వట్టి ప్రమిదల్లా ఉన్న మణి కళ్ళలో కాంతిరేఖ తళుక్కుమనాలి. ఇన్నాళ్ళ నుంచి తాను కన్న కలలన్నీ బంగారు పంటలు పండాలి. మంచం మీద అటూ, ఇటూ ఎంత కొట్టుకున్నా నిద్ర పట్టలేదు.

ఇంకా తూర్పు తెల్లవారకమునుపే మణిని వెంటబెట్టుకుని దయానిధి ఆసుపత్రికి బయలు దేరాడు. దారిలో హోటల్లో ఇద్దరూ కాఫీ తాగారు. ఆనాడు సెలవు కావాలని యజమానితో చెప్పి అనుమతి తీసుకొని కృష్ణమూర్తి మణిని చెయ్యి పట్టుకుని నడిపించుకుని వెళ్ళాడు.

"ఇదుగో, డాక్టరుగారూ, మీ ఫీజ."

"తరవాత ఇవ్వవచ్చులే—తొందరేముంది?"

"ఫరవాలేదు, ముందుగానే తీసుకోండి. జాగ్రత్తగా చెయ్యండి. మీదే భారం."

"నా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాను" అంటూ మణి చెయ్యి పుచ్చుకుని వార్డులోకి తీసుకు వెళ్ళాడు దయానిధి. మణి చూపులేని కళ్ళతో కడుపు తరుక్కుపోయేట్లు కృష్ణమూర్తి వైపు వెనక్కు, వెనక్కు చూస్తూ ముందుకు అడుగు వేసింది. లోపలి నుంచి పొంగివచ్చే ఆక్రోశాన్ని అణుచుకోలేక కళ్ళు తుడుచుకుంటూ నోటికి గుడ్డ అడ్డం పెట్టుకున్నాడు కృష్ణమూర్తి. 'ఏమీ భయం లేదు, మణీ, వెళ్ళిరా' అనే మాటలు గద్గద స్వరంతో ఎలాగో అనగలిగాడు.

లోపల ఆపరేషన్ జరుగుతున్నంత సేపూ ఆరాటంతో అటూ, ఇటూ తిరిగాడు. కొంచెం సేపు బల్లమీద కూర్చున్నాడు. తోచక వెంటనే లేచి పచార్లు చేశాడు. క్షణం ఒక యుగంగా గడిపాడు.

కొంత సేపటికి నర్సు వచ్చింది. "ఆపరేషన్ జయప్రదంగా నెరవేరింది. మూడు రోజుల దాకా ఎవరితోనూ మాట్లాడడానికి వీలులేదు. వారం తరవాత కట్టు విప్పుతారు." 'అమ్మయ్యో!' అను కున్నాడు. పెద్ద బరువు దింపినట్టు గుండె తేలిక పడి గాలిలో దూదిపింజలాగా తేలిపోతున్నంత సంతోషం కలిగింది.

అద్భుతమైన ఆనంద పారవశ్యంలో గేటు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు. ఏదో కొత్త లోకం బంగారు తలుపులు తెరుచుకుని ఆహ్వానిస్తున్నట్లు తోచింది.



తథగిణతోం

చిత్రక— సుజాత

"వీడే, సార్, కృష్ణమూర్తి" అనే కటిన స్వరం వినపడేసరికి స్వప్న లోకం కరిగిపోయింది. ఉన్నత శిఖరాల మీద నుంచి జరజరా పాతాళంలోకి దొర్లి పడిపోతున్నట్టు తోచింది. ఎదురుగా కాకీ దుస్తులూ, ఎర్రటోపీ. పక్కనే పై అధికారి.

"అరెస్టు చెయ్యండి. స్టేషనుకు తీసుకు పదండి" అని గర్జించాడు అధికారి.

కళ్ళు తిరిగి పోయాయి. తల దిమ్మెక్కిపోయింది. గొంతు తడి ఆరిపోయింది. ఏమిటీ విపరీతం? తను ఏం చేశాడనీ?

"ఊఁ. పద" అని అధికారి హెచ్చరించాడు. ఆ పరిస్థితిలో మణిని మాట్లాడించటానికి వీలు లేదు. తనకు సంభవించిన ఈ దుస్థితి విని విచారంతో మణి కంటతడి పెడితే చూపు వచ్చే ఆశ మరి ఉండదు. ఈ అవమానాన్ని మోసుకుంటూ, డాక్టర్ కంట పడటం తల వంపుగా ఉంటుంది. ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోవటమే మంచిదని తోచింది. సంకెళ్ళు వేశారు. తుపాకులతో అటొకడూ, ఇటొకడూ నిలబడ్డారు.

"పదండి" అని అడుగు సాగించాడు కృష్ణమూర్తి.

"గూటిలో చిలకేదిరా, చిన్నన్నా! గూడు చిన్న బోయెరా!" అని తంబూరా మీటుతూ తత్త్వం పాడుతున్న ముష్టివాడు ఎదురు వచ్చాడు.

తన ప్రాణాన్ని అక్కడ దిగవిడిచి ఒట్టి బొందె ముందుకు కదిలిపోతున్నట్టు అనిపించింది.

మళ్ళీ మణిని ఎన్నాళ్ళకు చూస్తానో అన్న దిగులు గుండె పిండివేస్తూంది. ఏదో తెలియని ఆపద నల్లటి రెక్కలు విప్పి తన బతుకులో కాంతి నంతటినీ మటుమాయం చేస్తుందనే భయంతో వణికిపోయాడు. దాటలేని మహా ప్రవాహ మేదో తనకూ, మణికీ మధ్యగా పరవళ్ళు తొక్కుతుందేమో? ఒక తీరాన తనూ, ఆవలి ఒడ్డున మణీ. ఇక జన్మలో కలుసుకో గలనా అనే భయం కలగగానే ఛీ! అమంగళం అనుకొని ఆ వూహను తుంచి వేశాడు.

స్టేషనుకు వచ్చాక తన మీద మోపిన నేరం ఏమిటో తెలుసుకొని కృష్ణమూర్తి చాప చుట్టలాగా పడిపోయాడు.

తను ఆరు వందలు పట్టుకొని వెళ్ళిపోయిన తరవాత ఆ రాత్రి 'అమ్మా' అనే కేక విని నౌకర్లు ధనంజయం గదిలోకి పరుగెత్తుకెళ్ళి చూశారు. గుండెలో కత్తి దిగబడిపోయి ఉందట. నెత్తురు మడుగులో తివాచీ మీద అతని శరీరం పడి ఉంది, ప్రాణం లేకుండా. స్టీలు బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో డబ్బూ, నగలూ అన్నీ మాయ మయి పోయాయి.

రాత్రి పొద్దుపోయేదాకా ధనంజయం గదిలో కృష్ణమూర్తి ఉన్నట్టూ, ఇద్దరూ పేక ఆడినట్టూ, అతని గదిలోంచి బయటికి రావటం తాము చూడ లేదనీ నౌకర్లందరూ సాక్ష్యం. కృష్ణమూర్తి మీద అందరికీ అనుమానం ఉన్నట్లు వెల్లడి అయింది. తనకు ఎంతో ఉపకారం చేసిన ధనంజయాన్ని తను హత్యచేయటం ఎంత అసంభవం! కాని, ఎవరు విని

స్క్రీన్ చదవండి

సుప్రసిద్ధ సినిమా వార పత్రిక

తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంసలు అందినవి. ఇటువంటి ప్రశంసలు పొందటానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారి పోవడం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అది ఎంత బాగా పనిచేస్తుందో చూడండి. నిరాశ చెందిన వేలకొలది రోగులు ఈ చెడు జబ్బు నుండి విముక్తి పొందాలని ఆశగా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఒక ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అనేక విధాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)



శుభవార్త

నాడీప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు

డా॥ ఎన్. ఎస్. రావు, M.B.H., R.M.P.

గారిని సంప్రదించండి:

రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,

ప్లాట్ నెం. 471, మాదాపురం రోడ్‌లో, జూబ్లిహిల్సు కో-ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్సు, బంజారా హిల్స్ ఎక్స్‌టెన్‌షన్, హైదరాబాద్-500 034 (నాంపల్లినుండి బస్సురూట్ 9V).

శరీర బలహీనత, పూబగా పెరుగుట గాని, చిన్నప్పటి నుండి సన్నగా నుండి ఏ మందు వలనను లావు కాకపోవుట, అంగములు వుండవలసిన సైజులో వుండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండెదడ, రక్త ప్రసరణ ఎక్కువ గావడం, లేక తక్కువ గావడం, సర్వ విధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తకడుపు ఎత్తుగా పెరగడం, జలోదరం, కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలి చేరుట, స్త్రీల ముట్టుకుట్టు నొప్పి, కుసుమవ్యాధి (ఏ రంగైనా సరే), మూత్రవ్యాధులు, మూలశంక, సుఖవ్యాధులు, స్త్రీలకు గాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపునొప్పి, నడుంనొప్పి, కీళ్ళవ్యాధులు, వాపు, నీరు చేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరము, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా పరిణమించినప్పుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలము: ఉ. 7 గంటల నుండి సా. 6 గంటల వరకు

పరీక్ష ఫీజు: రూ. 15/—. చికిత్సకు అదనం.

1, 2 తేదీలలో హైదరాబాద్‌లోని వెంకటేశ్వర లాడ్జిలో (లక్—డీ—క—పూల్) సంప్రదించవచ్చును.

ప్రతి నెల క్యాంపులు:— 5 వ తేదీ కర్నూలు—న్యూ ఉడిపి హోటల్ (పెద్ద మార్కెట్ వద్ద); 6 వ తేదీ గుంటకల్—శ్రీ లాడ్జి, 7 వ తేదీ కడప—ద్వారకాలాడ్జి; 8 వ తేదీ తిరుపతి—భీమాస్ అనెక్స్ లాడ్జి, 9, 10 తేదీలు మద్రాసు—కోమల విలాస్, నెం. 5, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్, (జి. టి.), హైకోర్టు ఎదురుగా; 11 వ తేదీ నెల్లూరు—రాఘవ విహార్; 12 వ తేదీ గుంటూరు — ఉడిపి కృష్ణభవన్, స్టేషన్‌రోడ్; 13, 14 తేదీలు రాజమండ్రి—శాంతినివాస్ (మెయిన్ రోడ్డు); 15, 16 తేదీలు వైజాగ్—బృందావన్ లాడ్జి, డాబా గార్డెన్సు; 17 వ తేదీ విజయవాడ మోడరన్ కేఫ్ లాడ్జి (గాంధీనగర్); 18 వ తేదీ ఖమ్మం—మయూర్ కేఫ్ (శేషమహల్ లాడ్జి); 19 వ తేదీ వరంగల్—హోటల్ నటరాజ్; 20 వ తేదీ నుండి హెడ్డాఫీసు.

N.B. పోస్టు ద్వారా సలహా కోరువారు ఫీజు రూ. 15, జవాబుకు పోస్టు బిళ్ళలు పంపవలెను.

Swastik

పించు కుంటాడు? తను నిర్దోషి అంటే ఎవరు నమ్ముతారు? అందులో తనకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యం ఉంది. చూస్తూండగానే చుట్టూ పద్మవ్యూహం పన్నుకున్నది. బయటపడే దారి కనబడలేదు.

చివరికి విచారణ రోజు కూడా తన పక్షం పలికే వాళ్ళెవరూ కనపడలేదు. న్యాయమూర్తి సాక్ష్యం బలాన్ని బట్టి అతణ్ణి శిక్షించక తప్పదన్నాడు. ఆరేళ్ళ కఠిన శిక్ష పడింది. కృష్ణమూర్తి చెయ్యని నేరానికి వేసిన శిక్షను ధైర్యంతో మౌనంగా భరించటానికి సంసిద్ధుడయ్యాడు.

కాని, మణి ఏమైపోతుందో అనే బాధ గుండెలో శూలాలు గుచ్చుతూంది. తనను గురించి ఎటువంటి విచారమూ లేదు. కాని, మణి జీవితం ఏమైపోతుందో అనే దిగులు అతణ్ణి క్రుంగదీసేస్తూంది. శోభామయంగా, ఆనంద నిలయంగా తీర్చిదిద్దా లనుకున్నాడు ఆమె జీవితాన్ని. తన సర్వస్వమూ సమర్పించి ఆమెకు సౌభాగ్యాన్ని సమకూర్చాలని ఎంతో ఆరాటపడ్డాడు. పెదవులదాకా వచ్చిన సుధా కలశం చెయ్యి జారి ధూళిపాలైపోయినట్లు, అతి సుందరమైన చిత్రపటం పూర్తి కానున్న వేళ విధి దానిమీద దుమ్ము చల్లినట్లు, మంగళాంతం కానున్న మధుర కావ్యం అగ్నికి ఆహుతి అయిపోయినట్లు — చెరసాల గోడల రాళ్ళను కన్నీళ్ళతో కరిగించేటంత వ్యథ పడ్డాడు కృష్ణమూర్తి. ఆ కఠిన శిలలకు తల బాదుకుంటూ, "ధర్మ దేవతకు చెవులేకాని, కళ్ళు లేవా?" అని పరితపించే వాడు. తన వంటి భాగ్యహీనుడు ద్వీపాంతరంలో ప్రవాసిగా ఉండటమే మంచిది అని ఒక్కొక్కప్పుడు తలపోసేవాడు.

"నేను వెళ్ళిపోతాను, బాబూ, నా దారికి అడ్డు రాకండి" అని దీనంగా కన్నీళ్ళతో అంది మణి.

"ఎక్కడికి?" అని దయానిధి ద్వారానికి అడ్డంగా నిలబడ్డాడు.

"ఎక్కడి నుంచి వచ్చానో అక్కడికే పోతాను. కష్టాలలో పుట్టి పెరిగాను. మృత్యువు ఎత్తుకొని బలికాను. ఆ ధర్మాత్ముడు నన్ను రక్షించాడు. చీకటి నిండిపోయిన నా కళ్ళకు వెలుగు చూపించాడు. తీరా నాకు చూపు వచ్చేసరికి మటుమాయమైపోయాడు. ఆ పుణ్యాత్ముణ్ణి వెతికి కనుక్కోవాలి. నా ఋణం తీర్చుకోవాలి. అప్పటికి కాని నాకు శాంతి దొరకదు" అని ఆవేదనతో అంది మణి.

"ఎక్కడున్నాడని వెతుక్కుంటూ వెళతావు? ఏమైపోయాడో అజాపజా లేదు. నీ దారిని నువ్వు వెళ్ళిపోయాక అతను నీ కోసం వెతుక్కుంటూ వస్తాడేమో? నువ్వు ఇక్కడే ఉంటే ఏనాటికైనా అతణ్ణి కలుసుకోగలవు. నా మాట విను. తొందరపడకు. బాగా ఆలోచించుకో" అన్నాడు దయానిధి.

మణి గాఢంగా ఆలోచించింది. అతను చెబుతున్నది సబబుగానే తోచింది. "అయితే, నేను ఇక్కడే ఉండిపోతాను లెండి. కాని, మీకు భారంగా ఉండడం నాకు కష్టంగా ఉంది. ఏదైనా పని చూపించండి."

"అలాగైతే నా ఆసుపత్రిలో నర్సుగా పని చెయ్యి. నీకు ఏ లోపమూ రాకుండా నేను చూస్తా" అన్నాడు నిధి.

"మీకు ఎంత దయ ఈ దిక్కులేని దానిమీద!"

అంటూ తాణికే కన్నీళ్ళతో చేతులు జోడించి నమస్కరించింది మణి.

అక్కడ కాలం గడిచి పోతూంది. ఆసుపత్రిలోనే ఒక గదిలో ఉంటూంది. ఒక్కొక్కనాడు మేఘాలతో మూసుకుపోయిన శ్రావణమాసపు ఆకాశం లాగా ఉండేదిమణిమనస్సు. కృష్ణమూర్తి ఎక్కడికివెళ్ళాడో? ఎన్నాళ్ళకూ తిరిగి రాడేమిటి? తన సంగతే మరిచి పోయాడా? అతనికేమైనా ప్రమాదం సంభవించిందా? అసలు క్షేమంగా సజీవుడై ఉన్నాడా? ఉంటే తన ముఖమైనా చూడకుండా ఇన్నాళ్ళు ఎందుకు ఉంటాడు? ఎడతెగని ఆలోచనలు హృదయంలో సుడి తిరిగి పోతాయి.

కళ్ళు లేని కబోదిని మనిషిని చేశాడు. కాంతి పథంలో తనను నిలబెట్టాడు. ఎంత కరుణాత్ముడో అతను! అతని ముఖం చూసే అదృష్టం తనకు లేకపోయింది. లోకంలో మనుషులనూ, మబ్బులనూ, రంగుల పువ్వులనూ,దూరాల నీలాల కొండలనూ, రాగాల రంగైన పిట్టలనూ తొలిసారి చూసి మణి మనస్సు గొప్ప విందు ఆరగించే అవకాశం వచ్చిన నిర్భాగ్యుడి మాదిరి పొంగిపోయింది. కాని,కృష్ణమూర్తి రూపం చూడలేదనే కొరత తీరని వ్యథ కలిగిస్తూంది. అతణ్ణి చూడటం కోసమే తనకు కళ్ళు రావాలని ఒకప్పుడు ఆరాట పడింది. దిక్కులేని తనకు అండగా నిలిచి, నీడ నిచ్చిన ఆ పుణ్యాత్ముని చూడని కళ్ళు దండగ. మళ్ళీ తన కళ్ళలో కాటుక చీకటి నిండిపోతే బాగుండును అనుకుంటుంది. తన ముసలి తల్లి, కృష్ణ హోటలు ముందు తను పాటలు పాడుతూ అడుక్కోవటం అన్నీ దూరం నుంచి తేలి వచ్చే విషాద రాగాలాపన లాగా మణి హృదయానికి వినిపించి కళ్ళలో నీరు తిరిగేది.

వెనక నించి వచ్చిన దయానిధి "మళ్ళీ అదే పనా?" అని మందలించేవాడు. చెంగుతో కళ్ళు అద్దుకుని చివాలున లేచి నిలబడి తల వంచుకునేది మణి.

'అమృత కలశం జీవితం. దీన్ని అశ్రువులతో నింపటం అపచారం. ఎన్ని కన్నీళ్ళు కార్చినా లాభం లేదు. బతుకు బాటలో మనిషి వెనక్కు వెళ్ళలేడు. అడుగు ముందుకు పడగానే వెనకాల తలుపులు మూసుకుపోతాయి. వాటిని ఎవరూ తెరిపించలేరు. ఇష్టం లేకపోయినా ముందుకు నడవవలసిందే' అని ఉపదేశ ధోరణిలో అనేవాడు.

ఆ మాటలు నెమరు వేసుకుంటూ మణి తన పనిలో మునిగిపోయేది. ముఖాలు కడిగించి, గుడ్డలు మార్పించి, పక్కల మీద నుంచి దుప్పటి వేయించి రోగులకు పరిచర్యలు చేయటంలో కాలం గడిచి పోతూంది. మొదట భారంగా ఉన్నా, ఆ సేవ రాను రాను ఆనందంగా కనిపిస్తూంది.

అప్పటికి మణి కంటి ఆపరేషన్ జరిగి రెండేళ్ళు దాటిపోయింది. గత జీవితం అంతా దుమ్ము కొట్టుకున్న పటం లాగా మసక బారిపోయింది. భావిని తలుచుకున్నప్పుడు లోతు తెలియని బావి అంచున నిలబడి వలయాలు తిరిగే కాటుక రంగు నీళ్ళలోకి తొంగి చూస్తున్నట్లనిపించేది. తన గతి ఏమి కానున్నదో అనే దిగులుతో మనస్సు చెదిరిపోయేది.

ఇలా ఉండగా దయానిధికి ఆకస్మికంగా మశూచి సోకింది. ముసలి తండ్రి తప్ప ఇంట్లో ఎవరూ లేరు. వ్యాధి తీవ్రంగా సోకటం మూలంగా నౌకర్లు అందరూ భయపడి పనిలోకి రావటం మానుకున్నారు. మణినికూడా ఎక్కడికైనా వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చారు.

కాని, మణి అక్కడినుంచి కదలలేదు. దయానిధి పక్కనే కుర్చీ వేసుకుని కూర్చుంది. ఒంటి మీద వడ్లగింజ వేస్తే పేలాలు వేగేటంత జ్వరం. ఒకటే ప్రేలాపన తెల్లవార్లూ. మధ్య మధ్య "మణీ! వెళ్ళిపో. దూరంగా వెళ్ళిపో" అంటాడు. ఒక్కొక్క సారి—"మణీ! నీ జీవిత మంతా ఇలా వ్యర్థమై పోవలసిందేనా?" అనేవాడు. అతని సుప్తచైతన్యంలోని తనను గురించి ఎటువంటి ఊహ లున్నాయో మణి తెలుసుకో గలిగింది.

మూడు రోజులు అతను కళ్ళు తెరవలేదు. వైద్యులుకూడా చూపు పోతుందేమో, కళ్ళు కాయలు కాసిపోతాయేమో నని భయపడ్డారు. మణి నిలువునా గజగజ వణికి పోయింది. తనకు దృష్టి దానం చేశాడు. ఆయన చేతి చలవ వల్లనే తన కబోది బతుకులో సూర్యోదయ మయింది. ఇప్పుడు ఆయన జీవితమే కాళరాత్రి అయిపోతుందేమో? ఈ ఆపద నుంచి రక్షించవలసిందని వెయ్యి దేవుళ్ళకు మనస్సులో మొక్కుకుంది. వేప కొమ్మలతో విసురుతూ, మజ్జిగ గొంతులో పోస్తూ, మొండి ధైర్యం తెచ్చుకొని మణి అక్కడే కూర్చుని దయానిధికి సేవ చేసింది. రావటం ఎంత ఎక్కువగా వచ్చిందో అంత తేలికగా తేలిపోయింది. స్నానం చేయించాక మణి గుడిలో



నువ్వహో నువ్వు ....

చిత్రం— జయరాం

కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించింది. ఆమె పథ్యం, పానం శ్రద్ధగా నడపటం వల్ల దయానిధి తొందరగానే కోలుకొని మామూలు మనిషి అయాడు. భయపడినంత వికృతం కాలేదు అతని రూపం. అక్కడక్కడ గుంటలు పడ్డాయి. ఎప్పటి మాదిరిగానే చూపు వచ్చేసింది. మణి పడ్డ మానసిక వ్యథ ఇంతా అంతా కాదు. అతనికి చూపు రాకపోతే జీవితమంతా అతని పక్కనే తాను ఉండాలనికూడా మనస్సులో అనుకుంది. కొండలాగా మీద విరిగి పడు తుందని భయపడిన ఆపద మంచులాగా కరిగి పోయింది.

"ఇప్పటికైనా నన్ను వెళ్ళిపోనివ్వండి" అని బతిమాలుకున్నది మణి.

"అసంభవం!"

"ఏం? మీ జబ్బులో వెళ్ళిపో, వెళ్ళిపో అన్నారుగా?"

"వెళ్ళిపోతావేమో అని లోపల ఉన్న భయం అలా తలక్రిందులుగా వెల్లడి అయింది. అంతే, నా ప్రాణం రక్షించిన నిన్ను ఇంట్లోంచి బయటికి వెళ్ళగొట్టేంత నీచుణ్ణి కాను. కృతఘ్నుణ్ణి కాను" అని ఆవేశ పడుతూ మణి చెయ్యి పుచ్చుకున్నాడు. శరీరమంతా కిన్నెరలు మీటిన విమల గాంధర్వం, స్వరనరాలలో మధుర సుధా ప్రవాహం.

"వదలండి. ఎవరైనా చూస్తారు" అని తప్పించుకో బోయింది మణి.

తోటలోనుంచి కోకిల కొసరి కొసరి కూస్తూంది. పూగే చెట్ల నీడలు గోడ మీద పారాడుతూ పెనవేసు కుంటున్నాయి.

"మణీ! ఎవరు చూసినా ఫరవాలేదు. నువ్వు నా ప్రాణానివి. నువ్వు నా హృదయానివి. నీ పరిచర్యల వల్లనే మృత్యు ప్రాంగణందాకా వెళ్ళిన ప్రాణం నవజీవన పథంలోకి మరలి వచ్చింది" అంటూ మణిని తన చేతులతో చుట్టివేశాడు. కట్టివేశాడు. అతని బాహు పంజరంలో రామ చిలక అయింది మణి. అతని మానస సరసిలో రాజమరాళి అయింది మణి. సిగ్గుతో, మధుసంతో తల వంచిన మణి జడలో ఫ్లవర్ పాట్‌లోంచి గులాబి పువ్వుతీసి తురుముతూ— "ఇక నువ్వు నా దానివి, మణీ!" అన్నాడు.

అతని గుండెలో మణి తల దాచుకుంది. ఆనందమో, విషాదమో తెలియకుండా వెక్కివెక్కి ఏడ్చింది.

• • •

ఆ నాడే కృష్ణమూర్తి విడుదల. బాధాకరంగా గడిచిన ఆరేళ్ళూ ఆరు యుగాలు. చెరసాలనూ, తోటి ఖైదీలనూ విడిచి వస్తూంటే ఎంతో బాధగా ఉంది. కఠిన శిక్షా మందిరం కూడా ఈ ఆరేళ్ళలో ఆత్మీయమై పోయింది. ఎదిరి వచ్చేటప్పుడు మనస్సు చివుక్కు మన్నది. జీవితంలోని కాఠిన్యాన్ని కూడా మన్నించే క్షమాభావంతో అతని హృదయం నిండి తొణికింది. కాల ప్రభావమే అటువంటిది! భరించే సమయంలో ఉన్న బాధ ముగింపుకి వచ్చినప్పుడు ఉండదు.

మళ్ళీ జీవితంలో అడుగు పెట్టాలి. తనకు లోకంలో 'నా' అన్న వారు లేరు. ఈ మధ్యకాలంతో

మణి ఏమైపోయిందో? తలుచుకోగానే మనస్సు అమృత హాలాహలాలతో నిండిపోతూంది.

బరువెక్కిన మనస్సుతో మెల్లగా అడుగులు వేస్తూ, కళ్ళతో పరిసరాలన్నీ గాలిస్తూ కదిలిపోతున్నాడు. ఎక్కడైనా మణి ఎదురవుతుందనే ఆశతో ముందుకు సాగిపోతున్నాడు.

పరధ్యానంగా బాట వెంబడి పోతున్నాడు. నాలుగేళ్ళ కుర్రవాడొకడు గాలిపటం ఎగరేస్తూ రోడ్డుమీద అడ్డంగా పరుగెత్తాడు. ఎదురుగా శరవేగంతో మృత్యు రథంలాగా పరుగెత్తుకు వస్తున్న లారీనికుర్రవాడుచూసుకోలేదు.కృష్ణమూర్తి ఒక్క దూకు దూకి కుర్రవాణ్ణి ఎత్తుకున్నాడు. లారీ పెద్ద ధ్వని చేస్తూ ఆగిపోయింది. వెంట్రుక వాసిలో ప్రాణాపాయం తప్పింది. కుర్రవాడు బిక్కమొహం వేసి బిగ్గరగా ఏడ్చాడు. కృష్ణమూర్తి కుర్రవాణ్ణి గుండెకు అదుముకుని— "భయం లేదు, బాబూ! మీ ఇల్లెక్కడ? ఇంట్లో నిన్ను అప్పగించి వెళతాను" అన్నాడు. పిల్లవాడు చూపుడు వేలుతో దూరాన ఉన్న బంగళాకేసి చూపించాడు. "డాక్టర్ దయానిధి క్లినిక్" అనే బోర్డు గిల్టు అక్షరాలతో మెరుస్తూంది. కృష్ణమూర్తికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. గతమంతా ఒక్కసారి కళ్ళ ముందు చక్రంలాగా గిర్రున తిరిగింది. డాక్టర్ గారిని అడిగితే మణి జాడ ఏమైనా చెబుతారేమో? తన వెర్రికాని వేలమంది రోగుల్లో మణి సంగతి ఆయనకు ఎందుకు గుర్తు ఉంటుంది? అయినా, ఏళ్ళ క్రిందటి విషయంలో డాక్టర్ ఏం ఆచూకీ ఇవ్వగలడు? తర్కించుకుంటూ లోపలికి అడుగు పెట్టాడు. కుర్రవాడు ఇంటి లోపలికి రాగానే—"అమ్మా" అంటూ కేకపెట్టాడు. కృష్ణ చేతుల్లోంచి కిందికి జారి లోపలికి పరుగెత్తాడు.

కొడుకు కేక విని తల్లి లోపలి నుంచి వచ్చింది. "అమ్మా! ఈయన చాలా మంచి ఆయన. నన్ను ఎత్తుకు వచ్చాడు. లారీ కింద పడిపోయే వాడిని..." వెక్కుతూ చెప్పాడు. "అయ్యో, నా తండ్రీ!" అంటూ కుర్రవాణ్ణి ఎత్తుకుని గుండెకు అదుముకుంది. ఇంకా పిల్లవాడికి గుండె దడ తగ్గలేదు.

"కూర్చోండి. బిడ్డ ప్రాణం రక్షించి పుణ్యం కట్టుకున్నారు. మీ మేలు మరిచిపోలేను. వీళ్ళ నాన్నగారు వచ్చే వేళ అయింది. దయచేసి కూర్చోండి" అంటూ కుర్చీ చూపించింది తల్లి.

కృష్ణమూర్తి నిలబడే ఉండిపోయాడు. రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు. తన కళ్ళను తాను నమ్మలేక పోయాడు. ఒంట్లో ఉన్న ఊపిరి అంతా మూటకట్టి, "మణీ!" అని కేకవేశాడు.

'ఎవరా' అని ఆశ్చర్యపోతూ నిలబడింది మణి. ప్రశ్నార్థకంగా కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"మణీ! నేను ... నేను ... కృష్ణని ... కృష్ణమూర్తిని'...'అని అతి ప్రయత్నంతో అనగలిగాడు.

గత కాలపు మడతల్లోంచి ఆ కంఠస్వరం తేలి వచ్చి ఆప్యాయంగా హృదయానికి సోకింది. ఎన్నాళ్ళ నుంచో ఎదురు చూసిన మధుర క్షణం ఈ నాడు హృదయ ప్రాంగణంలోకి వచ్చి నిలబడింది.

"వచ్చారా? మీరా? మీరా? !!!" అంటూ మణి కృష్ణమూర్తి పాదాలమీద వాలింది. అతని కాళ్ళను కళ్ళకు అద్దుకుంది. కన్నీటి చుక్కలు కృష్ణమూర్తి పాదాలమీద చిందినాయి.

క్షణంసేపు ప్రతిమలాగా నిలబడిపోయాడు కృష్ణమూర్తి. మెల్లగా వెనక్కు జరిగి దూరంగా నిలబడి మణి వైపు తీక్ష్ణంగా చూశాడు. లోపలినుంచి అణచుకోలేని ఆవేశం ఉప్పొంగుతూంది. "నువ్వు ద్రోహివి...వంచకివి... మహా పాతకివి. నా జీవితం ధ్వంసం చేశావు. నా హృదయం ముక్కలు చేశావు. నన్ను మరిచిపోయావు. నీ సుఖం నువ్వు చూసుకున్నావు. నీ మీద పగ తీర్చుకుంటాను. నీ సుఖాన్ని ధ్వంసం చేస్తాను. నీ గత జీవితాన్ని నీ భర్తతో చెప్పి వేస్తాను. నీకు నిలవ నీడ లేకుండా చేస్తాను. అప్పటికి కాని నాలో రగిలే మంట చల్లారదు" అని ఉన్మాదం పూనిన వాడిలాగా కేకలు వేశాడు.

మణి మళ్ళీ అతని కాళ్ళ మీద పడి చేతులతో చుట్టుకుంటూ-"క్షమించండి. మీ పాదాలు వదలను. కఠోదిని కనికరించి మనిషిని చేశారు. వెలుగు చూపించారు. మీ చేతులతో నా భాగ్యసౌధానికి పునాది వేశారు. మీ చేతులతోనే దీనికి నిప్పు అంటిస్తారా? మీ కిది ధర్మమేనా?" అని దీనంగా అశ్రువులతో గద్గద స్వరంతో అన్నది. బాబు చేత కృష్ణమూర్తి పాదాలకు దణ్ణం పెట్టించింది.

కృష్ణమూర్తి హృదయం కొన్ని క్షణాలు మంచి చెడుల మధ్య ఉయ్యాల లూగింది. తన జీవితం భగ్నమయింది. మణికూడా గూడు కూలిన పక్షి అయిపోయి విలపిస్తే తను భరించగలడా? మణిని మనిషిని చెయ్యటం కోసం సమస్తమూ సమర్పించాడు తాను. క్షణికమైన ఉద్రేకానికి వశమైపోయి మణి వచ్చని సంసారంలో నిప్పులు పోయటమా?! ఎటూ పాలుపోని కృష్ణ లోపల సాగర మథనం సాగింది. చేతిలో కత్తి ఉంటే మణి ప్రాణాలు తీయాలనిపించింది.

"క్షమించరా? చెప్పండి. మీ పాదాల దగ్గరే తల వేలకేసి కొట్టుకుని ప్రాణం విడుస్తాను" అంది మణి.

ప్రళయ ప్రభంజనంలో ఊగిపోతున్న పక్షి గూడులా ఉంది హృదయం. అగ్ని పర్వతాలు బద్దలౌతున్నాయి.

"ఛీ! ఇందులో నీ తప్పేముంది? ఇక వెళ్ళిపోతాను. నువ్వు సుఖంగా ఉండటమే నాకు కావలసింది" అని అప్రయత్నంగానే అనేశాడు కృష్ణమూర్తి.

నిజానికి ఎవరి తప్పు ఏముంది? ఎవరు ఎవరిని క్షమించాలి? మానవుల ఆశలకూ, విధి విలాసానికీ మధ్య అనాదిగా సాగుతున్న సంఘర్షణ ఇది. అంతే. మనుషులు నిమిత్తమాత్రులు అనిపించింది కృష్ణమూర్తికి. మానవ, దానవ ప్రవృత్తుల భీషణ ఘర్షణ మనస్సులో నమసింగా. మానవత విజయ పతాకం ఎగరేసింది.

"వెళ్ళటానికి వీలులేదు" అంది మణి.

"వెళ్ళక తప్పదు" అంటూ ఒక్క పరుగున తూనీగలాగా దూసుకుపోయి వీధి మలుపులో మాయమై పోయాడు కృష్ణమూర్తి.

తాను కాలిపోతూ చుట్టూ కాంతిని వెదజల్లుతుంది వత్తి. కృష్ణమూర్తి కూడా అంతే. అతను పుట్టింది సుఖం కోసం కాదు. అనుభవ పరిపాకంతో హృదయం పరిపక్వం కావటం కోసం! అందుకే ఈ జీవన పథంలో కృష్ణమూర్తి నిత్య యాత్రికుడు.

నిశ్చేష్టురాలై నిలబడి పోయిన మణి కళ్ళ ముందు లోకం నావలాగ చుట్టుకుపోతున్నట్లనిపించింది. ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చిన భర్త బూట్ల చప్పుడు వినిపించి ఉలిక్కిపడింది.

వస్తూనే—"పిల్లవాడికి గండం తప్పిందటగా?" అన్నాడు.

"ఆయన దేవుడు లాగా అడ్డుకుని పిల్లవాణ్ణి కాపాడాడు. మీరు వచ్చే దాకా ఉండమంటే వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు."

"పోనీ, ఏమైనా ఇచ్చి పంపకపోయావా?" అన్నాడు నిధి.

"ఏమి ఇచ్చినా ఋణం తీరదు" అంటూ లోపలికి వెళ్ళింది మణి. పొర్లి వస్తున్న కన్నీళ్ళను చాటుగా అద్దుకుంది. కృష్ణమూర్తి దారికి అడ్డంగా పండుకుని అయినా ఎందుకు ఆపలేదా అనిపిస్తోంది. మళ్ళీ ఎప్పటికైనా ఆతణ్ణి కలుసుకోగలనా? అనే చింతతో మణి మనస్సు వేగిపోయింది. ఇతరుల ఆనందం కోసం ఆహుతి అయిపోయే వ్యక్తులు లోకంలో ఇంకా మిగిలి ఉన్నారనిపించింది. ★

